

## హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

(స్పెషల్ టాస్క్ బ్యూరో )

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): రొమ్ము క్యాన్సర్ తర్వాత భారతీయ మహిళలు ఎక్కువగా ఎదుర్కొంటున్న గర్భాశయ క్యాన్సర్‌కు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) టీకాతో చెక్ పెట్టవచ్చని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. పదేండ్ల వ్యవధిలో దేశంలోని వివిధ దవాఖానల్లో 10–18 ఏండ్ల మధ్య వయసుండి హెచ్‌పీవీ టీకా వేసుకొన్న 2,135 మంది బాలికలపై ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ వివరాలను "హ్యూమన్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్మునోథెరిపిటిక్స్" జర్నల్‌లో ప్రచురించారు. ఈ అధ్యయనం ప్రకారం.. బాలికలకు హెచ్‌వీపీ సింగల్ డోస్ టీకా వేయడం వల్ల గర్భాశయ క్యాన్సర్ యొక్క జీవిత కాల ప్రమాదాన్ని తగ్గించవచ్చని తేలింది. అలాగే యుక్త వయసుకు ముందే బాలికలకు రెండు డోసు(మోతాదు)ల హెచ్‌వీపీ వ్యాక్సిన్‌లు వేయడం వల్ల మరింత వేగంగా గర్భాశయ క్యాన్సర్‌ను నిర్మూలించ వచ్చని అధ్యయనం వివరించింది.

## బోయింగ్ విమానంలో మళ్లీ సమస్య

అట్లాంటా: అమెరికాలో టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న డెల్టా ఎయిర్‌లైన్స్ విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. విమానం ముందు భాగాన ఉండే నోస్‌వీల్ ఊడిపోవడంతో వెంటనే అప్రమత్తమై టేకాఫ్‌ను నిలిపివేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. అట్లాంటా అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం కొలంబియాలోని బొగటాకు వెళ్లేందుకు బోయింగ్ 757 విమానం సిద్ధంగా ఉంది. ఆ సమయంలో విమానంలో 172 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు సహా ఆరుగురు సిబ్బంది ఉన్నారు.

# న్యాయ్ యాత్రలో రాహుల్ డూప్!

### అస్సాం సీఎం హిమంత సంచలన ఆరోపణలు

### యాత్రలో పాల్గొంటున్న రాహుల్ పోలికలున్న రాకేశ్

గువాహటి, జనవరి 25: అస్సాంలో న్యాయ్‌యాత్ర చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వ శర్మ గురువారం సంచలన ఆరోపణలు చేశారు. యాత్రలో రాహుల్ డూప్‌ను వాడుతున్నారని మీడియా కథనాలను ఉదహరించారు. బస్సులో ఒక గదిలో రాహుల్ చాలాసేపు కూర్చుంటున్నారని తెలిపారు. 'మామూలుగా రాహుల్ బస్సులోనే కూర్చొంటారని కాంగ్రెస్ నేతలు కొందరు నాతో చెప్పారు. అలాంటప్పుడు రాహుల్‌లాగా కనిపిస్తున్న మరో వ్యక్తి ఎవరు? రాహుల్ బస్సులో కూర్చొని టీ, స్నాక్స్ ఆస్వాదిస్తారు. మా రాష్ట్రంలో జరిగిన ప్రతి ప్రాంతంలో బీజేపీ గెలుస్తుంది. వాళ్ల యాత్ర ఉద్దేశం మత ఘర్షణలు సృష్టించేందుకేనా?' అని హిమంత ప్రశ్నించారు. మరోవైపు రాహుల్ యాత్రపై నమోదైన కేసుల్లో లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత అరెస్టులు ఉంటాయని హిమంత ఎక్స్‌లో వెల్లడించారు. రాహుల్ యాత్రలో తెల్లని టీ షర్ట్ వేసుకొని, గడ్డంతో రాహుల్ లాగే కనిపించే భోపాల్‌కు చెందిన రాకేశ్ కుశ్వాలాను న్యూస్ 18 పలుకరించింది. ఆయన న్యాయ్ యాత్ర ప్రారంభం నుంచి రాహుల్ గాంధీతో పాటు యాత్రలో పాల్గొంటున్నారు. 'నేను యువజన కాంగ్రెలో ఉన్నప్పటి నుంచీ రాహుల్‌ను అనుసరిస్తున్నాను. భారత్ జోడో యాత్ర జరిగినప్పుడు నేను రాహుల్ గాంధీని కలిసిన తర్వాత అందరి దృష్టి నావైపు మళ్లింది. దేశ ప్రజలు నన్ను రాహుల్ గాంధీతో పోల్చడం గర్వంగా ఉంది' అని రాకేశ్ వెల్లడించారు.


రాహుల్ గాంధీ | రాకేశ్


మోటారును ప్రారంభించడం కోసం బటన్ నొక్కుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

## సిద్ధరామయ్యకు చేదు అనుభవం

- ఎన్నిసార్లు బటన్ నొక్కినా ప్రారంభం కాని మోటార్
- నీటి సరఫరా ప్రారంభోత్సవంలో సాంకేతిక సమస్య
- మైసూరు కరెంటు బోర్డ్ ఎండీ సస్పెండ్

మైసూరు, జనవరి 25: కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు బుధవారం చేదు అనుభవం ఎదురైంది. కావేరీ జలాలతో 150 సరస్సులను నీటితో నింపే ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో సాంకేతిక సమస్య వల్ల ఆయన నొక్కి ప్రారంభించాల్సిన మోటార్ బటన్ పని చేయలేదు. దీంతో ఆయన రబ్బర్ తొడుగు వేసుకొని మరీ దాన్ని పలుమార్లు నొక్కారు. కానీ ఫలితం లేకపోయింది. దీంతో సీఎంకు ఇబ్బంది కలిగించారనే కారణంతో మైసూరు కరెంట్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ సీఎన్ శ్రీధర్ సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో, ప్రాజెక్ట్ నిర్వహణలో నిర్లక్ష్యం, ప్రారంభోత్సవానికి హాజరు కాకపోవడం వల్ల ఆయనను సస్పెండ్ చేసినట్టు మైసూరు కలెక్టర్ తెలిపారు. మీడియా సమక్షంలో పెరియ పట్టణ తాలుకా ముత్తిన ముల్లుసోగె గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

### ఆరోగ్య బీమా ఉంటే ఏ దవాఖానలోనైనా

## క్యాష్‌లెస్ చికిత్స

రెండవపేజీ తరువాయి...

చికిత్స పొందే అవకాశం ఉండేది. ఒక వేళ జాబితా(నెట్‌వర్క్)లో లేని దవాఖానల్లో చికిత్స పొందితే రీయంబర్స్‌మెంట్ (ముందు డబ్బులు చెల్లించి, తరువాత చెల్లింపులను పొందే) పొందే నియామాలు అమలులో ఉండేవి. కానీ వినియోగదారుల ఇబ్బందుల దృష్ట్యా జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ వివిధ ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చించి, ప్రతి చోటా నగదు రహిత వైద్య సేవల సదుపాయాన్ని తీసుకొచ్చింది. తాజా నిర్ణయంతో హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్నవారికి ఎంతో లాభం కలుగుతుందని జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ప్రకటించింది.

**కొత్త నిబంధనలు ఇవే**

- జాబితాలో లేని హాస్పిటల్‌లో చికిత్సపొందాలంటే కనీసం 48 గంటల ముందు సంబంధిత బీమా కంపెనీకి తెలియజేయాలి.
- అత్యవసర వైద్య సేవల సమయాల్లో మాత్రం ఆరోగ్య బీమాదారులు దవాఖానలో చేరిన 48 గంటలలోపు బీమా కంపెనీకి సమాచారం అందించాలి.
- పాలసీదారుడు కోట్ చేసే క్లెయిమ్ ఆరోగ్య బీమా పాలసీ నిబంధనల ప్రకారం ఆమోదయోగ్యంగా ఉండాలి.

## పాక్ టెర్రరిస్టుల హత్య భారత్ పనే

*పాక్ ఆరోపణ.. ఖండించిన భారత్*

ఇస్లామాబాద్: ఇటీవల పాక్‌లో కొందరు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమైన టెర్రరిస్టుల హత్యలకు భారతే కారణమంటూ పాకిస్థాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. కరుడుగట్టిన ఉగ్రవాద సంస్థలకు చెందిన ఇద్దరు పాక్ టెర్రరిస్టుల హత్యలతో భారత్‌కు చెందిన ఏజెంట్ల పాత్ర ఉందని నిరూపించే విశ్వసనీయమైన సాక్ష్యం తమ వద్ద ఉందని గురువారం ఆరోపించింది. భారత్ తమ భూభాగంలో కుట్రలతో ఈ హత్యలకు పాల్పడిందని పాకిస్థాన్ విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ సైరస్ సజ్జద్ ఖాజీ ఆరోపించారు. భారత ఏజెంట్లు ఈ విషయంలో సాంకేతికతను, సురక్షిత మార్గాలను వినియోగించారని ఆయన అన్నారు. వారు కొందరు ఉగ్రవాదులు, నేరస్థులు, ఏమాత్రం అనుమానం కలగని పౌరులను ఈ పనికి నియమించి ఈ హత్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. మరోవైపు టెర్రరిస్టుల హత్యలపై పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది.

### జ్ఞానవాపి కింద

## హిందూ ఆలయం

రెండవపేజీ తరువాయి...

భారీ హిందూ దేవాలయం ఉనికిని సూచిస్తున్నదని పేర్కొన్నారు. అంతకు ముందున్న దేవాలయంపైనే ప్రస్తుతమున్న కట్టడం (మసీదు)ను నిర్మించారని తెలిపారు. ఇందుకు తగిన అనేక ఆధారాలను పురావస్తు శాఖ తన నివేదికలో పొందుపరిచిందని చెప్పారు. ఆ ప్రదేశంలోని అనేక చారిత్రక నిర్మాణపు పొరలకు సంబంధించి పురావస్తు శాఖ పలు ప్రశ్నలను లేవనెత్తిందని పేర్కొన్నారు. స్వల్పంగా మార్పులు చేర్పులు చేసి దేవాలయపు స్తంభాలను, ప్లాస్టర్‌ను మసీదు నిర్మాణానికి వాడుకున్నారని తెలిపారు. దేవాలయపు స్తంభాలపై ఉన్న కళాకృతులను చెరిపివేసినట్టు పురావస్తు శాఖ పేర్కొందని వెల్లడించారు. పురాతన దేవాలయానికి సంబంధించిన శాసనాలు కూడా ఆ ఆవరణలో లభించాయని, అవి దేవనాగరి, తెలుగు, కన్నడతోపాటు ఇతర భాషల్లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతమున్న కట్టడం (మసీదు), అంతకు ముందు కట్టడంపై అనేక శాసనాలను గమనించామని పురావస్తు శాఖ తెలిపిందని అన్నారు. మొత్తంగా ప్రస్తుత సర్వేలో 34 శాసనాలు, 32 ముద్రలున్న పత్రాలు బయటపడ్డాయని చెప్పారు. దేవాలయానికి సంబంధించిన ఓ బండరాయిపై శాసనాలు కనిపించాయని, ఆ రాయిని మసీదు నిర్మాణంలో, ఆ తరువాత మరమ్మతు సమయంలో కూడా వాడుకున్నారని తెలిపారు. దీనిని బట్టి పూర్వ నిర్మాణాన్ని కూల్చివేసి దానికి సంబంధించిన కొన్ని భాగాలను నూతన (మసీదు) నిర్మాణంలో వాడుకున్నట్టు తెలుస్తున్నదని అన్నారు. ఆ శాసనాలలో 'జనార్దన', 'రుద్ర', 'ఉమేశ్వర' అనే దేవతల పేర్లు కనిపించాయని చెప్పారు. తామర పతకానికి ఇరువైపులా చెక్కిన వ్యాల బొమ్మలను చెరిపివేశారని తెలిపారు. ఆలయం మూలల్లో ఉన్న బండరాళ్లను తొలగించి, ఆ స్థలాన్ని పువ్వుల ఆకృతులతో నింపివేశారని చెప్పారు. వారణాసిలోని కాశీ విశ్వనాథుని ఆలయం పక్కనున్న జ్ఞానవాపి మసీదుపై పురావస్తు శాఖ నిర్వహించిన సర్వేకు సంబంధించిన నివేదికను హిందువులకు, ముస్లింలకు అందజేయాలని స్థానిక కోర్టు బుధవారం ఆదేశించింది. ప్రస్తుతమున్న 17వ శతాబ్దం నాటి జ్ఞానవాపి మసీదును అంతకుముందున్న దేవాలయాన్ని కూల్చివేసి నిర్మించారని ఆరోపిస్తూ కొందరు హిందువులు దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన వారణాసి కోర్టు పురావస్తు శాఖ సర్వేకు ఆదేశించింది. పూర్వమున్న హిందూ దేవాలయాన్ని కూల్చివేసి మసీదును నిర్మించారా లేదా అన్నది తేల్చేందుకు పురావస్తు శాఖ గత ఏడాది జ్ఞానవాపి మసీదు ఆవరణలో శాస్త్రీయ సర్వే నిర్వహించింది.

## క్యాన్సర్‌ను పోగొట్టాలని ప్రాణాన్ని 'గంగపాలు' చేశారు

- **హరిద్వార్‌లో అయిదేండ్ల బాలుడి మృతి**
- **తల్లిదండ్రుల మూఢ నమ్మకాలకు బలి**

న్యూఢిల్లీ : తల్లిదండ్రుల అమాయకత్వం, మూఢ నమ్మకాలకు ఐదేళ్ల బాలుడు బలైపోయాడు. ఢిల్లీ పోలీస్ సూపరింటెండెంట్ స్వతంత్ర కుమార్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... బాలుడు బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. అతనిని సర్ గంగారామ్ దవాఖానకు చికిత్స కోసం తీసుకెళ్లారు. వైద్యులు ప్రయోజనం లేదని చెప్పారు. గంగా నదిలో పవిత్ర స్నానం చేయిస్తే, వ్యాధి నయమవుతుందని విశ్వసించారు. న్యూఢిల్లీ నుంచి బాలుడితో పాటు తల్లిదండ్రులు, మరొక వ్యక్తి హరిద్వార్‌లోని గంగా నది వద్దకు బుధవారం వచ్చారు. అందరూ చూస్తుండగానే ఆ బాలుడిని పదే పదే నదిలో ముంచారు. దీంతో ఆ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనను చూసినవారు ఆ తల్లిదండ్రులను మందలించారు. అయితే ఆ బాలుని శవం వద్ద ఉన్న అతని తల్లి మాట్లాడుతూ, తన కుమారుడు లేచి, నిల్చుంటాడని చెప్పారు. కొందరు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని ఓ దవాఖానకు తరలించగా, అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం తరలించారు.


